నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

I హైదరాబాద్, బుధవారం 27 నవంబర్ 2024 | SIDDIPET


## బీఆర్ఎస్ హయాంలో మహిళలకు పెద్దపీట

సంగారెడ్డి జిల్లా కంది మండలం బేగంపేటలో మహిళా సంఘాల భవనానికి ఫర్నిచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

**సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

కంది, నవంబర్ 26: బీఆర్ఎస్ హయాంలో మహిళలకు ప్రాధాన్యమిచ్చామని, వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేశామని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. కంది మండలం బేగంపేటలో సంఘ సేవకుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయిగౌడ్ సొంత ఖర్చుతో మహిళా సంఘాల భవనానికి కావాల్సిన ఫర్నిచర్ కొనుగోలు చేసి మంగళవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. సంఘాల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. బేగంపేట గ్రామాన్ని పంచాయతీగా చేసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, మహిళా సంఘ భవన నిర్మాణం తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలు మళ్లీ కేసీఆర్ ప్రభుత్వాన్నే కోరుకుంటున్నారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ నాయక్, బీఆర్ఎస్ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కందిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# భావితరాలకు తెలిసేలా దీక్షాదివస్

- కేసీఆర్ పోరాట పటిమ తెలియజేస్తాం..
- దీక్షాదివస్ స్ఫూర్తితో కాంగ్రెస్, బీజేపీపై పోరాటం
- 29న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి
- సంగారెడ్డిలో విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్
- ఢిల్లీ మెడలు వంచిన కేసీఆర్ గురించి అన్నివర్గాలకు తెలియజెబుతాం
- 29న కంది పార్టీ కార్యాలయంలో ఘనంగా దీక్షాదివస్
- బీఆర్ఎస్ జిల్లా పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ దేవీప్రసాద్
- దీక్షా దివస్ నిర్వహణపై సన్నాహక సమావేశం
- విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు
- కందిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాట్ల పరిశీలన

సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న దేవీప్రసాద్, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

సంగారెడ్డి , నవంబర్ 26(నమస్తే తెలంగాణ): కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో అని ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను లెక్కచేయకుండా పోరాటం చేసి దీక్షా దివస్‌తో ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ పోరాటపటిమ భావితరాలకు తెలిసేలా ఈనెల 29న సంగారెడ్డిలో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ దీక్షా దివస్ సన్నాహక సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, జిల్లా పరిశీలకుడు దేవీప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి,డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, ఆదర్శ్‌రెడ్డి, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్ పాల్గొన్నారు. సన్నాహక సమావేశంలో ఈనెల 29న దీక్షా దివస్ నిర్వహణపై చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. అనంతరం మీడియాతో బీఆర్ఎస్ చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కందిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఈనెల 29న దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. 29, నవంబర్ 2009న కేసీఆర్ చేపట్టిన దీక్షాదివస్‌కు తెలంగాణ చరిత్రలో ప్రత్యేక స్థానం ఉందన్నారు. కేసీఆర్ దీక్ష ఫలితంగానే అప్పటి ఢిల్లీ సర్కార్ దిగివచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన చేసిందన్నారు. తెలంగాణ కోసం కేసీఆర్ చేసిన పోరాటం భావితరాలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర సాధన అనంతరం కేసీఆర్ పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. కేసీఆర్‌తో పాటు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో కేటీఆర్, హరీశ్‌రావు కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. ఈ విషయాలన్నీ ప్రజలు, యువతకు తెలిసేలా, దీక్షా దివస్ స్ఫూర్తి రగిలేలా ఈనెల 29న కందిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు చెప్పారు. దీక్షా దివస్‌కు ఐదు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**దీక్షా దివస్‌కు ఏర్పాట్లు పరిశీలన**

దీక్షా దివస్ సన్నాహక సమావేశం మంగళవారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ దేవీప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి,డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ నేతలు జైపాల్‌రెడ్డి, పట్నం మాణిక్యం, ఆదర్శ్‌రెడ్డి, పట్నం మాణిక్యం, కాసాల బుచ్చిరెడ్డి, మామిళ్ల రాజేందర్, శివరాజ్‌పాటిల్, కోడూరి రమేశ్, ఆదర్శ్‌రెడ్డి, సోమిరెడ్డి, వెంకటేశంగౌడ్, అంజయ్యయాదవ్, సాయికుమార్, డాక్టర్ శ్రీహరి, మల్లయ్య, రవీందర్‌నాయక్, నజీబ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు. దీక్షా దివస్ విజయవంతం కోసం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ఈ సందర్భంగా చర్చించారు. ఏర్పాట్లకు ప్రత్యేకంగా ఇన్‌చార్జిలను నియమించాలని నిర్ణయించారు. 29న సంగారెడ్డి పట్టణంతో పాటు కంది గులాబీమయంగా మారాలని, ప్రతిచోట పార్టీ జెండాలు, స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ పార్టీ నాయకులకు సూచించారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణదీక్ష ప్రాధాన్యత అందరికీ తెలిసేలా దీక్షాదివస్ రోజున ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. సమావేశం ముగిసిన అనంతరం దేవీప్రసాద్, చింతా ప్రభాకర్, మాణిక్‌రావు, చంటి క్రాంతికిరణ్, భూపాల్‌రెడ్డి, శివకుమార్, జైపాల్‌రెడ్డి, మామిళ్ల రాజేందర్ తదితరులు కందిలోని పార్టీ జిల్లా కార్యాలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. దేవీప్రసాద్ ఏర్పాట్లకు సంబంధించి జిల్లా నాయకులకు పలు సూచనలు చేశారు.

### చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్

**– మాజీ ఎమ్మెల్సీ, దీక్షా దివస్ జిల్లా పరిశీలకుడు దేవీప్రసాద్**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మృత్యువు ముఖంలో తలపెట్టి తెలంగాణ సాధించారని, దీక్షా దివస్ చరిత్రలో నిలిచిపోతుందని జిల్లా పరిశీలకుడు దేవీప్రసాద్ పేర్కొన్నారు. కేసీఆర్ ఆమరణ దీక్ష ద్వారా ఢిల్లీ మెడలు వంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ప్రకటన వచ్చేలా చేశారని గుర్తుచేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ దీక్షా దివస్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా తెలంగాణ ఉద్యమంలో అగ్రభాగంలో నిలిచిందన్నారు. కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసం చేసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మెడలు వంచేలా ప్రజలు మరోమారు దీక్షా దివస్ స్ఫూర్తితో ఉద్యమించాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపునిచ్చారు. ఈనెల 29న కందిలో నిర్వహించే దీక్షా దివస్‌కు ఐదు నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని దేవీప్రసాద్ కోరారు.

## సమస్యలు నాదృష్టికి తెస్తే పరిష్కరిస్తా

దానంపల్లిలో జీపీ భవన పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

చేర్యాల, నవంబర్ 26: తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంతో పాటు అభివృద్ధిలో అగ్రభాగాన నిలిపిన గొప్ప నేత కేసీఆర్ అని, ఆయనను ప్రజలు ఎప్పుడు గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని దానంపల్లిలో రూ.44 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, గ్రంథాలయ భవనం, సీసీ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి పల్లెసీమలను అభివృద్ధి చేయడమే తన లక్ష్యం అన్నారు. తాను ఎమ్మెల్యే విజయం సాధించినప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నానని, గ్రామాల వారీగా ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను ఎక్కడికక్కడ పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. సమస్యలపై ప్రజలు నేరుగా తనకు ఫోన్ చేయాలని, తనను కలిసేందుకు ఎవరి రెకమెండేషన్ అవసరం లేదన్నారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బీఆర్ఎస్ శ్రేణులు తప్పక తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. గ్రామ చెరువుకు కాళేశ్వరం జలాలు తీసుకువచ్చానని, దానంపల్లి నుంచి నర్మెట్ట వరకు బీటీ రోడ్డు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, నాయకులు పెడుతల ఎల్లారెడ్డి, వుల్లంపల్లి కరుణాకర్, వకులభరణం నర్సయ్య పంతులు, వడ్లకొండ శ్రీనివాస్, మిట్టపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గదరాజు చందు, ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, రాచకొండ శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, వంగ చంద్రారెడ్డి, అరిగె కనకయ్య, దాసు, శనిగరం లక్ష్మణ్, ఎర్రోల్ల యాదగిరి, అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ కృషితోనే 'తెలంగాణ' సాకారం

- ఈనెల 29న పార్టీ జిల్లా కార్యాలయంలో దీక్షా దివస్
- హరీశ్‌రావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొంటారు..
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి

సిద్దిపేటలో మీడియాతో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, వంటేరు ప్రతాప్‌రెడ్డి, కడవేర్గు రాజనర్సు, రాధాకృష్ణశర్మ తదితరులు

సిద్దిపేట అర్బన్, నవంబర్ 26: కేసీఆర్ కృషి ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, కేసీఆర్ చేపట్టిన దీక్ష రాష్ట్ర ఏర్పాటుకు బలమైన పునాదిగా నిలిచిందని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు వంటేరు ప్రతాప్‌రెడ్డి, కడవేర్గు రాజనర్సు, రాధాకృష్ణశర్మ, ఇతర నాయకులతో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. వరంగల్ నగరంలో జరిగిన ఓ సభలో "కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో" అనే నినాదాన్ని కేసీఆర్ చేశారని, అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనే ఏకైక లక్ష్యంగా ఉద్యమం చేశారన్నారు. నవంబర్ 29న సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో దీక్షా దివస్ జరుపుకొంటామని.. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొంటారని తెలిపారు. దీక్షా దివాస్ వద్ద ఫొటో ఎగ్జిబిషన్‌తో పాటు కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీలు, 420 హామీలు ఇచ్చి ప్రజలను వంచించిందన్నారు. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేసినా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్ జపం చేస్తున్నారని విమర్శించారు. హామీలు అమలు చేయకుండా విజయోత్సవాలు ఎందుకని ఆయన ప్రశ్నించారు. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నదని స్టేటుమెంట్లు ఇస్తూ, తీరా రూ. కోట్లు ఖర్చు పెట్టి విజయోత్సవాలు నిర్వహించడం అవసరమా అని ఆయన ప్రశ్నించారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా ముఖ్య నాయకులతో నవంబర్ 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు.

## కూలీ డబ్బులు ఇప్పించండి మేడం

ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డికి గోడు వెల్లబోసుకుంటున్న మహిళా కూలీలు

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని వేడుకున్న కూలీలు

నర్సాపూర్, నవంబర్ 26: ఉపాధి హామీ కూలీ డబ్బులు ఇప్పించండి మేడం... అంటూ నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని పలువురు ఈజీఎస్ మహిళా కూలీలు వేడుకున్నారు. మంగళవారం మండలంలోని పెద్దచింతకుంటలో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులతో కలిసి పర్యటించి మొక్కలు నాటారు. ఏడాదిగా తమకు కూలి రావడం లేదని ఈ సందర్భంగా పలువురు కూలీలు ఎమ్మెల్యేకు గోడు వెల్లబోసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో మధులత, ఏపీవో అంజిరెడ్డి సమక్షంలోనే మహిళా కూలీలు ఎమ్మెల్యే విషయం చెప్పుకొచ్చారు. పెద్దచింతకుంట గ్రామం ప్రధాన రహదారికి ఇరువైపులా గతేడాది మొక్కలు నాటామని, వాటికి సంబంధించిన డబ్బులు ఇంకా తమకు చెల్లించలేదని తెలిపారు. మొక్కలకు గోతులు లోతుగా రాకుంటే టిఫిన్ బాక్స్ మూతలతో తీశామని ఓ మహిళ తన బాధను వెల్లగక్కింది. ఈ డబ్బుల గురించి మండల కార్యాలయానికి వెళ్లి అడగగా, ఎందుకు లొల్లి పెడుతున్నారంటూ మందలించాలరని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంపై ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అధికారులను ప్రశ్నించారు. తక్షణమే కూలీలకు డబ్బులు అందజేయాలని ఆదేశించారు. అక్కడే ఉన్న మండల ప్రత్యేకాధికారి కల్పించుకొని కూలీల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

## కంపు కొడుతున్న కేజీబీవీ


చిట్కుల్ కేజీబీవీ ఆవరణలో మురుగుదొడ్లు, మూత్రశాల నుంచి వచ్చిన మురుగు

చిట్కుల్ కేజీబీవీఆవరణలో తరగతి గదుల వెనక మూత్రశాలల వద్ద మురుగు

చిలిపిచెడ్, నవంబర్ 26: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చిట్కుల్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) అధికారుల పర్యవేక్షణ లేక అధ్వానంగా మారింది. పాఠశాల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. మురుగుతో పరిసరాలు కంపుకొడుతున్నాయి. పాఠశాలలో వందల మంది విద్యార్థినులు చదువుతున్నారు. దుర్గంధంతో వారంతా అనారోగ్యానికి గురవుతున్నారు. తాగునీటి సంపు వద్ద మురుగు నిలిచి సంపునకు వెళ్లే నీటితో కలుషితం జరిగి విద్యార్థినులు అనారోగ్యానికి గురవుతున్నారు. తరగతి గదుల వెనుక మురుగు పారుతున్నది. దీంతో దుర్వాసనతో విద్యార్థినులు ముక్కు మూసుకుంటున్నారు. రాత్రివేళ దోమలు కుట్టడంతో అనారోగ్యం పాలవుతున్నారు. ప్రతిరోజు ఉదయం వేడినీరు రాకపోవడంతో చల్లని నీటిలో స్నానాలు చేయడం ఇబ్బందిగా ఉందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

## వైద్యసిబ్బంది సరిగ్గా విధులు నిర్వర్తించాలి

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక దవాఖానలో వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

దుబ్బాక, నవంబర్ 26: దుబ్బాక వంద పడకల దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యసిబ్బందికి స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం దుబ్బాక వంద పడకల దవాఖానలో అభివృద్ధి కమిటీ సమావేశానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే వనితా భూంరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా దవాఖానలో అందుతున్న వైద్యసేవలు, మందులు, డయాలసిస్, శానిటేషన్‌తో పాటు వైద్యసిబ్బంది పనితీరు, రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. బీఆర్ఎస్ హయాంలో కార్పొరేట్ తరహాలో సకల వసతులతో ఈ దవాఖాన నిర్మించామని, సరిపడా వైద్యసిబ్బంది ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందకపోవడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. వేతనాలు, ఇతరత్రా ఖర్చు నిమిత్తం ఈ దవాఖాన మీద ప్రభుత్వం ప్రతి నెలా రూ. కోటి వ్యయం చేస్తున్నదని, కానీ.. సేవలు అంతంతమాత్రంగానే ఉన్నట్లు ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో వైద్యసిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర సమయాల్లో సరిగ్గా వైద్యం అందించ లేకపోతున్నారని ప్రశ్నించారు. దవాఖానలో నెలకొన్న సమస్యలపై వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌తో ఫోన్‌లో ఎమ్మెల్యే మాట్లాడారు. డెంటల్ విభాగంలో వైద్య పరికరాలు లేకపోవడంతో దంత వైద్యులను ఇతర చోటకు పంపించాలని, వారి స్థానంలో చిన్న పిల్లల డాక్టర్లను నియమించాలని ఎమ్మెల్యే కోరారు. ఆరోగ్యశ్రీకి సంబంధించిన రూ.40 లక్షలు నిధులు దవాఖాన అభివృద్ధికి వినియోగించాలని ఈ సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, కౌన్సిలర్లు దేవుని లలిత, ఆస యాదగిరి, స్వామి, శ్రీనివాస్, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం...**

ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్‌లో ఉపాధిహామీ పథకంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు పనులకు, ఓ రైతు వ్యవసాయ భూమిలో కూరగాయల తోటలో నీటి తొట్టి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వెంట ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఉన్నారు. అనంతరం రాజక్కపేటలో అంబేద్కర్ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో బక్కి వెంకటయ్య, కైలాశ్, ఎల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్, భూంరెడ్డి, పండు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దాం

సిద్దిపేట, నవంబర్ 26: కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిఘటిద్దామని జాయింట్ ప్లాట్‌ఫారం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్,సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం సిద్దిపేటలోని అంబేద్కర్ చౌరస్తా పాత బస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, హెచ్ఎమ్మెస్ జిల్లా అధ్యక్షుడు ఇదారి మల్లేశం, బీఆర్టీయూ జిల్లా నాయకుడు శోభన్, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎడల వనేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాళ్లబండి శశిధర్, ఈరి భూమయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేదలను విస్మరించి కార్పొరేట్ల ప్రయోజనం కోసం పనిచేస్తున్నదని దుయ్యబట్టారు. జాతి సంపదను స్వదేశీ, విదేశీ కార్పొరేట్లకు తెగ నమ్ముతోందన్నారు. అనేక త్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి సమ్మె హక్కులను కాలరాస్తూ, 12 గంటల పని విధానం అమలులోకి తెస్తున్నదని విమర్శించారు. కాంట్రాక్టు లేబర్ విధానం అన్ని రంగాల్లో పెరిగి తీవ్రమైన శ్రమ దోపిడీ జరుగుతోందన్నారు. వీటన్నింటిపై ఐక్యంగా పోరాడుతామని పేర్కొన్నారు. ఆందోళనలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కృష్ణారెడ్డి, నాయకులు తాడూరి రవీందర్, ఏఐటీయూపీ జిల్లా నాయకుడు సంపత్, రైతు సంఘం నాయకులు కనకాచారి, ప్రభాకర్, కనకరాజు, వెంకటేశం, మండల భాస్కర్, వంగ రవీందర్ రెడ్డి, జెర్రిపోతుల జనార్దన్, కర్ణాల చంద్రం, మల్లేశం, భిక్షపతి, సిద్దేశ్వర్ పాల్గొన్నారు.

సిద్దిపేట పాత బస్టాండ్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఆయా సంఘాల నాయకులు

## గురుకులాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్

కొల్చారం కస్తూర్బాగాంధీ పాఠశాలలో చెత్త డబ్బాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొల్చారం, నవంబర్ 26: జిల్లాలోని అన్ని సంక్షేమ గురుకులాల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడతామని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మంగళవారం కొల్చారంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని కూరగాయల నిలువ గదిని పరిశీలించారు. కుళ్లిపోయిన, ముదిరిపోయిన కూరగాయలు ఉండటాన్ని గమనించి ప్రిన్సిపాల్‌ను మందలించారు. ఎప్పటికప్పుడు తాజా కూరగాయలు తెప్పించాలని సూచించారు. వంట పాత్రలను, వండిన వంటలను పరిశీలించారు. వంటల్లో నాణ్యతను, శుభ్రతను పాటించాలని సూచించారు. అనంతరం తొమ్మిదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. విద్యార్థులకు రసాయన శాస్త్రంలో పలు ప్రశ్నలు వేయగా, విద్యార్థులు సరైన సమాధానాలు చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెరుగైన విద్యా ప్రమాణాలు పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో 105 సంక్షేమ పాఠశాలలు ఉన్నాయన్నారు. అన్ని సంక్షేమ గురుకులాల్లో, ఆరోగ్య కేంద్రాల్లో, అంగన్‌వాడీల్లో ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపడతామని తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రాథమికంగా బియ్యం, కూరగాయలు, గుడ్లు వంటి వస్తువుల నాణ్యత, పాత, కొత్త స్టాకులకు ప్రత్యేక నిలువ సదుపాయం, నిలువ గదులు, ఇతర పాఠశాల ప్రాంగణంలో పరిశుభ్రత, వంటల నాణ్యత, వంటపనివారు, సర్వింగ్ విధానం వంటి అంశాలపై దృష్టి పెడతామన్నారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో శ్రీరాం, డీఈవో రాధాకిషన్, ఎంఈవో రమేశ్, కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రత్యేకాధికారి ధరణి, పంచాయతీ సెక్రటరీ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాడైన కూరగాయలు

పాచిపట్టిన నీళ్లు

# కుళ్లిన కూరగాయలు.. పాచిపట్టిన నీళ్లు

- కస్తూర్బా ఎస్‌వోపై డీపీవో యాదయ్య ఆగ్రహం

టేక్మాల్, నవంబర్ 26: విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, పరిసరాల శుభ్రతపై దృష్టిసారించాలని మండల ప్రత్యేక అధికారి (డీపీవో) యాదయ్య ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం టేక్మాల్ కస్తూర్బాగాంధీ విద్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల భోజనానికి ఉపయోగిస్తున్న కూరగాయలను పరిశీలించారు. కుళ్లిన కూరగాయలు, పాచిపట్టిన నీళ్లు ఉండటంతో ఎస్‌వో బాలమణిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. హాస్టల్‌లో నీళ్లు పాచిపట్టి ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పలుమార్లు చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఉదయం పెట్టే టిఫిన్ తిన్న తర్వాత కడుపు నొప్పి వస్తున్నదని, బాత్‌రూమ్‌లు శుభ్రం చేయడం లేదని, దుర్వాసన వస్తున్నదని విద్యార్థినులు వాపోయారు. ఇలా ఉంటే సహించేది లేదని డీఈవో హెచ్చరించారు. ఆయన వెంట తహసీల్దార్ తులసీరామ్, ఎంపీడీవో విఠల్, ఎంఈవో సుజాత ఉన్నారు.

కూరగాయలను పరిశీలిస్తున్న డీపీవో